# నిన్నటికీ రేపటికీ మధ్య...

"రహీమోళ్ల యింట్లో యీ పొద్దేమీ తినద్దు. నువ్వు తర్పణ మొదలాల. కిష్టసామి అయివోరు వెయ్యింఢ్ల పూజారి. పన్నెండుకంతా వాళ్లింటికి పొయ్యి, వెంటబెట్టుకోని రా..." పొగ చూరిన వంటగదిలో కట్టెలపొయ్యి ముందు కూర్చున్న మాణిక్యమ్మ పెద్దగా కేకేసింది.

గబగబా స్నానం ముగించి వచ్చిన రాంబాబు, తువ్వాలుతో శరీరాన్ని అరకొరగా తుడుచుకున్న తర్వాత, నిక్కరూ చొక్కా తగిలించుకుని, బొత్తాలుపెట్టుకుంటూ వీధిలోకి పరిగెత్తాడు.

వుత్తర దక్షిణాలుగా వ్యాపించిన వీధికి రెండువైపులా, తూర్పు పడమరలకు అభిముఖంగా, వరసగా రకరకాల యిండ్లున్నాయి. అప్పటికే వీధిలో యెండ పెళపెళగాయటంతో, వీధి కుక్కలు మినహా నర సంచారం కానరావడం లేదు. నాలుగైదిళ్లు దాటుకున్న తర్వాత వో మిద్దెంటి ముందు ఆగాడు రాంబాబు. అక్కడినుంచీ తూర్పుకు చీలుతున్న వీధికేసి రెండు నిమిషాలు పరకాయించి చూశాడు. నేలపైన బండలు పరచిన ఆ వీధికి రెండువైపులా దాదాపుగా అన్నీ పెరటి వాకిళ్లే కనిపిస్తున్నాయి. కాస్త దూరంలో వోయింటి పెరటికి యెదురుగా, గోతాల పరదా కట్టిన చిన్న వసారా ముందుగా, వీధిలోనే కుంపటి రగిలిస్తూ కూర్చున్న వో నడి వయసు స్త్రీకేసి కాస్సేపు తేరిపారజూశాడు రాంబాబు. ఆ తరువాత వెనక్కు తిరిగి మిద్దెంటిలోకి సాగబారాడు.

మిద్దెంటి వరండాలో బెంచీలపైన అయిదారుగురు నడవయస్సు దాటిన మగవాళ్ళు కూర్చుని వున్నారు. వుతికీ వుతికీ వాడుతూరావడం వల్ల కావి రంగులోకి మారిపోయిన జుబ్బాలతో, మోకాళ్ల వరకూ దిగజారిన గళ్లలుంగీలతో, తలలకు దట్టంగా దట్టించిన అంగరకాలతో, ముఖాల్ని దాదాపుగా కప్పేసిన నలుపూ తెలుపూ రంగుల గడ్డాలతో, వాళ్లందరూ పాతకాలెండర్లోని దర్గాబొమ్మలోంచీ ప్రాణం పోసుకుని బయటికొచ్చిన అరబిక్ అక్షరాల్లా కనిపిస్తున్నారు. వాళ్ళ దగ్గరి నుంచీ వేడి టీని జుర్రుతున్న పెదవుల సవ్వళ్ళూ, తెలుగు యాసతో వూడిపడుతున్న వూర్దూ మాటలూ ప్రసారమౌతున్నాయి. రాంబాబు రాకను వాళ్లు పట్టించుకోలేదు. గోడపైన గడియారంలో వూగుతున్న లోలకాన్ని చూస్తూ వాడు యింటిలోపలికి జారుకున్నాడు.

హాల్లో చెక్కకుర్చీలో కూర్చున్న వ్యక్తి, బాగా ముందుకు వంగి పరవశంగా ప్రసంగిస్తున్నాడు. అతడి మాటల ప్రవాహంలోపడి తబ్బిబ్బయి పోతున్న కుర్రాడు, రాంబాబును చూడగానే మెల్లగా నవ్వడానికి ప్రయత్నించాడు.

"అందుకని దినమ్మూ అయిదుసార్లు నమాజు చెయ్యాల. నా మాదిరిగా డ్యూటీలు చేసేవాళ్లకు అది సాధ్యం గాదనుకో! కానీ కనీసం పొద్దనొకసారి, సాయింత్రమొకసారి అయినా మజీదుకు పోవాల. అల్లాను దువా అడిగితే యేదయినా జరిగితింది. అల్లానే నమ్ముకోవాల... నీకు కావల్సిందేంది? మంచి చదువు. అల్లాపైన భక్తి. యింకా చానా కావాల. అన్నీదువా అడుక్కోవచ్చు..." చెబుతూ చెబుతూనే అతను వెనుదిరిగి రాంబాబు కేసి చూస్తూ "వీడెవుడు?" అని అడిగాడు.

"నాఫ్రెండు.. విజయరంగం అయివోరికొడుకు..."

"యెవురూ? మొగరాల విజయరంగం అయివోరేనా?" అని అడిగాడతను.

ఆ కుర్రాడు తలవూపాడు.

అతను రాంబాబుకేసి తిరిగి "మీరెందురు బిడ్డలు అయివోరికి?" అని ప్రశ్నించాడు.

"నేనొకడే కొడుకు... మా చెల్లి అయిదు చదవతావుంది..." అన్నాడు రాంబాబు.

"నేను మొగరాల్లో మీ తాత పెద్ద మునిరత్నం పిళ్లె దగ్గర చదివినానులే! అప్పుడు చదువంటే యిప్పుటి మాదిరిగాదు. అయివోరు గనిమగట్టు పల్లెకాడ వస్తాకనబడితే చాలు, స్కూల్లో మాకు నిక్కర్లు తడిసిపోతా వున్నాయి. ఆ

భయమూ, భక్తీ యిప్పుడెక్కడుండాది? అయినా అయివోరంటే అయివోరా ఆయన? పరమాత్ముడు గదా! ఆ పొద్దు ఆయిన దగ్గిర దెబ్బలు తినబట్టేగదా నా మాదిరోళ్లకు గూడా రెండచ్చరాలు వచ్చుండేది. దీపంపెట్టి తల్చుకోవల్సిన మనిషిగదా మీ తాత!" చెబుతూ చెబుతూ అతను అర్ధనిమీలిత నేత్రాలతో, చేతులు జోడించుకుని అలాగే ఆగిపోయాడు.

అతడికేసి విస్తుపోతూ చూడసాగాడు రాంబాబు.

అంత పొడువూ పొట్టీగాని కుదిమట్టపు ఆకారం అతడిది. తొడుక్కున్నది పాంటో, పైజామానో తెలియడంలేదు. చొక్కాగూడా లూజుగా వేలాడుతోంది. వేసుకున్న దుస్తులూ, తలపైని గుడ్డటోపీ తెల్లరంగువే గావడం వల్ల అతడి ముఖంలోని నల్లటి గడ్డం కొట్టొచ్చినట్టుగా కనబడుతోంది.

"నేను మాత్రం మీ తాతదగ్గర చదివినాను" కాస్సేపటి తర్వాత కళ్లు తెరుస్తూ అన్నాడతను. "మాతమ్ముళ్లందురూ మీ నాయిన దగ్గిర చదివినారు. మా మూడో తమ్ముడు సురాజుద్దీన్‌కు మీ నాయినంటే భలే గురి! మీనాయిన చెప్పి వొప్పించక పొయ్యుంటే మాపాచ్చా వాణ్ణి యెయిర్‌ఫోర్స్‌కు పంపే వుండడు... పాపం, అల్లా ఆయనకు పూర్తి ఆయుస్సు యీలా! చూస్తావుండంగానే ఆయిన చచ్చిపోయి సంవత్సరమైపోయినట్టుండాది... నువ్వేం చదవతావుండావు?"

"పది... అక్బర్ క్లాసే!" అన్నాడు రాంబాబు.

"బాగా చదువు. మీ నాయనపేరూ, మీ తాత పేరూ నిలబెట్టాలనువ్వు!" అంటూ అతను అక్బర్‌కేసి తిరిగాడు "మంచిదోస్తీనే చేసినావు... కర్నమోళ్ల అయివోరంటే మా పాచ్చాకు భలే యిది. మా పాచ్చాకు మొగరాల్లో గుడ్డలంగిడి వునిందిలే! విజయరంగం అయివోరూ, వాళ్ల నాయినా యెప్పుడూ మాయింటికే వచ్చి గుడ్డలు కొంటావున్నారు. బంగారట్లా మనిషిగదా అయివోరు! అట్లాంటి మనిషిని యింకేడ చూడబోతాం!"

గోడకుర్చీ వేసినట్టుగా నిల్చున్న అక్బర్ కాస్త పక్కకు జరుగుతూ," పోయిన దసరా హాలిడేస్ అప్పుడు మేమిద్దరం చిత్తూరుకొచ్చుంటిమి. మీ యింట్లోనే నాలుగు దినాలుంటిమి!" అన్నాడు.

"వీన్నెప్పుడూ చూసినట్టు జ్ఞాపకంలేదు. అప్పుడు నేనేమైనా కాంపుకు పోయినానేమో!" అన్నాడతను రాంబాబుకేసి మరోసారి కళ్ళు విప్పార్చుకుని చూస్తూ.

"మా పీయిటీ అయివోరు కోకో కాంపుకని చిత్తూరుకు పిల్చుకోని పోయినాడు. వాళ్లందురూ స్కూల్లోనే వుండిపోయినారు. నేనూ రాంబాబు మనింటికొచ్చేసినాం. నువ్వు హైదరాబాదుకు పోయినావని మీ భాషా చెప్పినాడు..." అంటూ మరికొన్ని వివరాలు అందించాడు అక్బర్.

"చింతగుంట్ల పెద్దపీరాంసాహేబు కుటుంబానికీ మొగరాల విజయరంగ మయివోరికీ సంబంధం యీ దినందా? మా తాత చేసిందేమో చింత పండు యాపారం. మా నాయినదేమో గుడ్డలంగిడి. అయినా మా అన్నదమ్ముల్లో యిద్దరీపొద్దు రెవిన్యూ డిపార్ట్‌మెంటులో వుండారంటే, యింకొకడు యెయిర్ ఫోర్సులో వుండాడంటే అందుకు కారణం అయివోరే గదా!" అతను చెప్పు కుపోతూనే వున్నాడు.

"అమ్మ బజారుకు పొయిరమ్మనింది మామూ!" అంటూ అక్బర్ రాంబాబు చేయి పట్టుకుని వంటింటిలోకి లంగించేశాడు.

పైకప్పును పెంకులతో కట్టిన ఆ గదిలో వోగోడ పూర్తిగా కనబడకుండా కుండల దొంతరలే సర్దుకున్నాయి. మరోవైపున్న చిన్న అలమారాలో రకరకాల డబ్బాలూ, గిన్నెలూ నిండి పోయివున్నాయి. గది చివరిలో గూడుపొయ్యిముందు కూర్చున్న స్త్రీ వో చేత్తో వూదు బుర్రతో కుస్తీ జేస్తూ, మరో చేత్తో పొయ్యిపైని గుండాలోని గరిటెను తిప్పుతోంది" ఆమె వెనక గడప కానుకుని కూర్చున్న అమ్మాయి రోజా రంగు షల్వార్ కమీజులో మిలమిలమెరుస్తోంది. ఆమె జడపైన మల్లెపూల సరాలూ, మెడలో నల్లపూసలపేరూ వొకదానితో వొకటి పోటీ పడుతున్నట్టుగా కనిపిస్తున్నాయి.

"అరరే, గుల్నారక్క! యెప్పుడొచ్చింది? బాగుండావా?" అంటూ పలకరించాడు రాంబాబు.

"వచ్చి గంటయిందిలే! నువ్వింకా కనబడలేదే అనుకుంటూ వుండాను." అంటూ గుల్నార్ బేగం తానుతింటున్న పళ్ళాన్ని వారిముందుకు చాపుతూ "తీసుకో!" అంది.

"వద్దు. యీ పొద్దు మా నాయిన తద్దినం. నేనొకపొద్దు" అన్నాడు రాంబాబు.

"అయితే మాకంతా మధ్యాహ్నం భోజనం మీయింట్లోనేనే?" అందామె కళ్లెగరేసి అదోలా నవ్వుతూ.

"షాహుల్ బాయిని పిలుచుకోనొస్తానని పొద్దననంగా పొయినాడు మీ అన్న.

యింకా రాలేదు. పొయి పిలుచుకోనిరాపో!" అంది పొయ్యి ముందుకూర్చున్న స్త్రీ.

ఆమె మాటలు పట్టించుకోకుండా "మీకు పరీక్షలయి పోయినాయా బూ!" అని ప్రశ్నించాడు అక్బర్.

"మాకు యేప్రెల్లో పరీక్షలు. మీకు?" అని అడిగింది గుల్నార్‌బేగం.

"యూనివర్సిటీలో నీ పరీక్షలూ, హైస్కూల్లో వీళ్ల పరీక్షలూ రెండూ వొకటేనా? పెద్ద ఫ్రెండ్సే దొరికినార్లే నీకు! ముందు వాన్ని పెద్దన్నను పిల్చుకోని రమ్మని చెప్పు. యీ మద్దిస్తం సంగతి తేలితే ఆపైన నీ చదువులు నువ్వు బాగ చిదగచ్చు" అక్బర్ తల్లి యీ సారి గుల్నార్ బేగంపైన మండిపడింది.

బలవంతంగా యెవరో తోసినట్టుగా కదులుతూ, పెరటి తలుపులగుండా బయటికొచ్చేశాడు అక్బర్. సందులోంచీ వీధిలోకి నడుస్తూ వెనుదిరిగి రాంబాబుతో "గుల్నారక్కకు పెండ్లయిపోయిందంట!" అన్నాడు.

"నిజంగా!" అంటూ ఆశ్చర్యపోయి, "మనకు యిన్విటేషను గూడా యీయలేదు" అని నిష్టూరపోయాడు రాంబాబు.

"ప్రింటు జేసి వుంటే గదా యిచ్చేదానికి! లవ్ మేరేజీ అంట! జరిగి రెండు నెలలయిపోయిందంట! వాళ్లయింట్లో గూడా చెప్పలేదంట! యిప్పుడామె కోసరమే మా యింట్లో మద్దిస్తెం."

"వాళ్లమ్మా నాయినా రాలేదా?"

"వాళ్లింక ఆమె ముఖం గూడా చూడమని చెప్పేసినారంట! అందుకే వాళ్ల పెద్దనాయిన రహంతుల్లా వచ్చినాడు. యిందాకా నాతో మాట్లాడతావున్నాడు జూడు, ఆయినే ఆరై రహంతుల్లా సాబు. యెవుడైనా అణకవగా నా మాదిరి దొరికితే చాలు, నమాజు చెయ్యి, మజీదుకు పో అని వూదరగొడతా వుంటాడు. ఆయినే యిప్పుడు గుల్నారక్కకూ, ఆమె భర్తకూ మద్దిస్తం యేర్పాటు జేసినాడు..."

"గుల్నారక్క హజ్బెండెక్కడ?"

"జనవీధిలో విద్యాసాగర్ వాళ్ళింట్లో దిగినాడంట! ఆయిన విద్యాసాగర్‌కు స్వయానా పెద్దనాయిన కొడుకే నంట! ఆయనేమో బలిజ, ఆమేమో షేకు."

"గుల్నారక్కది యింటర్‌కాస్ట్ మారేజీనా?" రాంబాబు ఆశ్చర్యపోయాడు.

"కాదు. దాన్ని యింటర్ రిలిజియన్ అంటారని మా పెద్దన్న చెప్పినాడు." అన్నాడు అక్బర్.

అంతా అయోమయంగా అనిపించటంతో రాంబాబు కాస్సేపు మౌనంగా వుండి పోయాడు. తరువాత "కిష్టసామయివోరు యింటికొచ్చినాడేమో చూద్దాం పద!" అంటూ బండ్ల వీధికేసి నడచాడు.

గోతాల పరదా ముందు, బండరాళ్లు పరిచిన నేలపైన, కుంపటి యింకా రగులుతోంది. కుంపటిపైని రాగిడేగిశాను గంజి మరకలు చుట్టేశాయి. కొద్దిగా పైకెగగట్టిన గోతాల తెరకవతల, నల్లటి నాపరాళ్లతో కట్టిన వరండాపైన, మాసిన పడక చుట్టలు, వో మూలగా రకరకాల కూరగాయలకుప్ప, దాని కటువైపున కొత్తచేట వొకటీ కనబడుతున్నాయి. వాటి వెనక గోడకున్న పాతకాలపు చిలకల తలుపుకు తుప్పుపట్టిన బీగం కప్ప వేలాడుతోంది. ఆ తలుపు గుబ్బలకు గూడా సంచులూ, మాసిన బట్టలూ వేలాడుతున్నాయి. వరండా కటువైపు చివరి నుంచీ తెరుచుకున్న తలుపు మరొకటి కనబడుతోంది. బాగా మసిబారి, మురికి గొట్టుకు పోయివున్న గొందిలాంటి ఆ చిన్నగదిలోకి తొంగి చూస్తూ "సామీ!" అంటూ కేకేశాడు రాంబాబు.

వొంటి మీద నిక్కరు తప్పమరో ఆచ్ఛాదనలేని నల్లటి కుర్రాడొకడు గదిలోని చీకటి లోంచీ అప్పుడే పుట్టుకొచ్చినట్టుగా వెలుపలికొచ్చి "నువ్వా! అక్కడే వుండు. లోపలి కొచ్చేస్తున్నావేం?" అని హుంకరించాడు.

"సుబ్బయ్యా! మీ నాయిన పన్నెండుకంతా మా యింటికొస్తానన్నాడు. తర్పణమొదలాల" అన్నాడు రాంబాబు వెనకకు రెండడుగులు వేస్తూ.

"వెధవగోల... లోపలికి రావద్దంటే వినరేం?" అంటూ యీ సారి గృహిణి యీ యీసడిస్తూ గదిలోంచీ చరచరా బయటికొచ్చింది. "స్వామి హరెప్ప శెట్టి యింట్లో యేదో కార్యాని కెళ్లాడు. వెళ్లిచూడుపో!"

పరదా దగ్గరికో అడుగు సారిస్తూ "సుబ్బయ్యా మధ్యాహ్నం యీతకు బోతావుండాం. వస్తావా?" అని అడిగాడు అక్బర్.

సుబ్బయ్య పెదవులపైన చేయివుంచుతూ, తల్లికి కనబడకుండా సైగలు చేయసాగాడు. ఆమె మాత్రం "యీతాలేదు పాడూలేదు... మా వాణ్ణి చదువుకో నివ్వరా మీరు!" అంటూ రుసరుసలాడింది.

అక్బర్‌తో బాటూ రాంబాబు గూడా వెనుదిరిగి బజారు వీధికేసి నడవసాగాడు.

"మనమేమో సుబ్బయ్యగాణ్ణి పాడుచేసేట్టు వాళ్ళమ్మ దబాయిస్తాదేందిరా! వానికెప్పుడూ సంఖ్యల్లో మార్కులు రాలేదని ఆర్ముగమయివోరు అంకెలోడని

పేరు పెట్టేసినాడు గదా!" చెబుతూనే నవ్వేసాగాడు అక్బర్.

"యింటిలోపలికడుగు బెట్టి యెక్కడ మైలజేసేస్తామో అని అయివోరమ్మ ఆగడం. యెప్పుడు చాక్లెట్టిచ్చినా చెయ్యితగలకుండా పైకెత్తి యెయ్యమని సుబ్బయ్య గింజుకుంటాడు" అన్నాడు రాంబాబు.

వాళ్ళు నడుస్తున్న వీధి రామాలయం దగ్గరికి వచ్చాక బజారువీధిలో కలిసిపోయింది. వుత్తరదక్షిణాలుగా వ్యాపించిన ఆ వీధి రహదారిగూడా కావడంతో దాని మొగదలలో యెర్రటి బస్సొకటి ఆగివుంది. వీధికి రెండువైపులా సన్నగా పొడవాటి లోగిళ్లు కనిపిస్తున్నాయి. ముందు భాగాల్లో రకరకాల అంగళ్లూ, వెనక భాగాల్లో నివాసాలూ వున్న ఆ యిళ్లు కిటికీలు గూడా లేకపోవడంతో వరసగా నిలబెట్టిన యినప్పెట్టెల్లా వున్నాయి.

"యెప్పుడో, నేను పుట్టకముందే, మీ పలమనేరు చుట్టమొకాయిన మా అమ్మమ్మకు చెల్లి కూతుర్ని నిఖాజేసుకున్నాడని చెప్పినారు. మనం వరసలు లెక్క బెడితే నువ్వు నాకు మామ కొడుకయినావు. ఆ లెక్కన యిప్పుడు విద్యాసాగర్ గాడు గూడా మనకు చుట్టమైనట్టే గదా!" అన్నాడు రాంబాబు బజారువీధిలో నడుస్తుండగా.

"గుల్నారక్క హజ్బెండు విద్యాసాగర్‌కు అన్నవతాడు. అంటే వాడు గూడా యిప్పుడు నాకు మామకొడుకే అయినాడు. భలే భలే! బాగుందీ చుట్టరికం!" వుత్సాహంతో రాంబాబు చేయిపట్టుకున్నాడు అక్బర్.

"మనూరి పంచాయితీ బోర్డులో పనిజేస్తా వున్నాగూడా విద్యాసాగర్ వాళ్లనాయన్ని అందురూ తిరుపతాయిన అనే పిలస్తారు. గుల్నారక్క హజ్బెండుది గూడా తిరపతేనా?" అని అడిగాడు రాంబాబు.

తెలియదన్నట్టుగా అక్బర్ భుజాలెగరేశాడు.

గోడలు కనిపించకుండా చెక్క అలమారాలే నిలబెట్టిన వో అంగడి ముందు యిద్దరూ ఆగిపోయారు. అలమారాల్లోంచీ గాజుసీసాల్లోని పదార్థాలూ, నేలపైని డబ్బాల్లోని పప్పులూ, పొడులూ వినియోగదార్లను కవ్విస్తున్నాయి. వీధి గ్రిల్ తలుపుల దగ్గర రంగురంగుల ప్లాస్టిక్ పాకెట్లు వేలాడుతున్నాయి. గల్లాపెట్టె ముందు కూర్చున్న కుర్రాడు, నిక్కరూ చొక్కాల్లోకి కుదించుకోలేకపోతున్న భారీ శరీరంతో సతమతమై పోతున్నాడు.

"రేయ్ కరుణా! కిష్టసామయివోరు మీ యింట్లో వుండాడా!" అంటూ వాణ్ణి పలకరించాడు అక్బర్.

"వుండార్లే!" అన్నాడు కరుణాకర్ విసుగ్గా.

"పన్నెండుకంతా మా యింట్లో తర్పణ మొదలాల" రాంబాబు అందుకున్నాడు "కొంచెం పిలస్తావా?"

"పూజలోవుండాడు. యింకా గంటపడతాది!" అన్నాడు కరుణాకర్ ముక్తసరిగా

"పోనీ, నేనే యింట్లోకి పొయి పిలిచేసొస్తాను" అని ప్రాధేయపడ్డాడు రాంబాబు.

"మిమ్మల్నా నడవలోకి రానిస్తే మా అమ్మ తంతాది" అన్నాడు కరుణాకర్.

"రేయ్! మీ యింట్లోకి పోయి రెండు వూరుగాయముక్కలైనా తేపో! నోరుజివజివలాడతావుండాది" అన్నాడు అక్బర్.

"యిప్పుడుగాని వంటిట్లోకి పోతే మా అమ్మ చీపురు తిరగేస్తాది" కరణాకర్ కంఠంలో మార్పేమీలేదు.

"పోనీ నేనొచ్చి పిలస్తావుండానని అయివోరికి చెప్పేసి రాపో!" దీనంగా అడిగాడు రాంబాబు.

"పూజయినాంక చెప్తాన్లేపో!" అన్నాడు కరుణాకర్.

ముఖం చిట్లించుకుని వెనుదిరిగాడు రాంబాబు. కాస్త దూరం నడిచాక" యీ సుబ్బయ్యా వాళ్లయింట్లో, కరుణాకర్ వాళ్ల యింట్లో యేందాచిపెట్టు కోనుండారో చూడాలని వుందిరా! యెప్పుడూ గడపదాటి లోపలికి రానియ్యరేంది వాళ్లు!" అని వాపోయాడు.

వాడిమాటలు వినబడనట్టుగా "గుల్నారక్క హజ్బెండెట్లుండాడో చూసి పోదామా?" అని అడిగాడు అక్బర్.

బజారు వీధిలోంచీ సన్నటి సందులోకి తిరిగి, కొన్ని యిండ్లు దాటిన తర్వాత, వో గడప ముందు ఆగుతూ, "విద్యాసాగర్!" అని పిలిచాడు అక్బర్.

మరో రెండుసార్లు పిలిచిన తర్వాత కొప్పుముడేసుకుంటూ బయటికొచ్చిన స్త్రీ "యేరా అగ్బర్! మా విద్యాగానీ కనిపించినాడా?" అంటూ తానూ ప్రశ్ననే సంధించింది.

తెలియదన్నట్టుగా తలవూపుతూ "వాళ్ల పెదనాయిన కొడుకొచ్చి నాడన్నారు." అని సాగదీశాడు అక్బర్.

"ఆ కొత్తపెండ్లికొడుకు యింకా మా యింట్లో యెందుకుంటాడు లేగానీ, కొత్తిమిర కావాల. బజార్నించీ తెచ్చిస్తావా?" అంటూ సమాధానం కోసం

యెదురు చూడకుండా, అలమారులోంచీ రెండు నాణాలు తీసి అక్బర్ చేతికిచ్చింది. "యిప్పుడే వచ్చేస్తా, నువ్వీడే వుండు" అంటూ అక్బర్ బజారుకేసి దౌడు తీశాడు.

విద్యాసాగర్‌తల్లి వంట గదిలోకెళ్ళిపోయింది.

రాంబాబు యింటిలోపలికెళ్ళి, హాల్లో కూర్చుని, దిన పత్రిక. తిరగేయ సాగాడు.

అయిదు నిమిషాల తర్వాత కొత్తిమిరకట్టతో బాటూ వచ్చిన అక్బర్, వంట గదిలోకెళ్ళి, తిరిగొస్తూ రెండు వడల్ని పట్టుకొచ్చాడు.

వాళ్ళిద్దరూ తిరిగొచ్చేసరికి అక్బర్ వాళ్ళ యింట్లో వాతావరణం పూర్తిగా మారిపోయివుంది. గడ్డాల, తలపాగాల ముల్లాలయిదుగురూ హాల్లోకొచ్చి నవారు మంచంపైన బైటాయించి వున్నారు. జమాబందీ కొచ్చినట్టుగా కుర్చీలో ధర్జాగా కూర్చున్న అరై రహంతుల్లా పక్కన, మరో కుర్చీలో అంతకంటే ధీమాగా మరో యువకుడు ఆసీనుడైవున్నాడు. వంటగది గడప కానుకుని కూర్చుని హాల్లోకి చూపులుసారిస్తోంది గుల్నార్‌బేగం. అతిథులందరికీ టీ గ్లాసులందిస్తున్న యువకుడు అక్బర్‌కేసి చూస్తూ "యీ యెండలో యెక్కడ తిరగతా వుండావురా?" అని గద్దించాడు.

"అమ్మనిన్ను పిలుచుకోని రమ్మంటే..." అంటూ అక్బర్ హాల్లోకొచ్చి బెంచీపైన కుర్చున్నాడు. రాంబాబుగూడా అతడి పక్కకు చేరాడు.

టీ చప్పరిస్తూనే తన యెదుట కూర్చున్న యువకుడికేసి పరకాయించి చూస్తూ "అయితే రిజిష్టరుమారేజీ చేసుకునే దానికి ముందు మీరీ విషయాలేమీ మాట్లాడుకోలేదా?" అని అడిగాడు రహంతుల్లా.

అతనే గుల్నార్ బేగం భర్తని స్ఫురించడంతో రాంబాబు అక్బర్ భుజాన్ని గిల్లాడు. కూర్చుని వుండడంచేత అతనెంత పొడవున్నాడో స్పష్టంగా తెలియడంలేదు. కళ్ళజోడులోంచీ పెద్ద పెద్ద కళ్ళు కనిపిస్తున్నాయి. మీసాలు కొద్దిగా కిందికి వంగడం చేత అతను నవ్వుతున్నాడో, కోప్పడుతున్నాడో తెలియరావడంలేదు.

"భర్త చెప్పినమాట భార్య వినాలగదా?" అని అడిగాడతను

"ఆవొక్కటీ తప్ప నేనేమాట విన్లేదు?" అంది గుల్నార్ బేగం.

"అది మాత్రం యెందుకు వినగూడదు?"

"నొష్టపైన బొట్టు పెట్టుకుంటే అలర్జీ వచ్చిందని చెప్పినానుగదా!"

"అదేంలేదు! యిష్టంలేక అలర్జీ అని సాకు..."

"యింత చిన్న విషయానికి కొట్లాడుకుంటే అదేం బాగుంటుంది?" యీ సారి ప్రశ్న రహంతుల్లా దగ్గరినుంచీ వచ్చింది.

"యిదేమీ చిన్నవిషయంగాదు. నా చిన్నప్పుడు మావూర్లో వొక బాపనామె మీసాయిబును పెండ్లాడింది. అప్పట్నించీ బొట్టూ గిట్టూ అన్నీ మానేసింది. యిప్పుడామెను చూస్తే యెవురైనా బూబమ్మనే అనుకుంటారు" అన్నాడు గుల్నార్ బేగం భర్త.

"యెప్పుడో, యెక్కడో యేందో జరిగితే యిప్పుడెందుకు? నాయిష్టం నాది, నీ యిష్టం నీది అని అనుకుంటే తప్పేముంది?" అంది గుల్నార్‌బేగం.

"మనసులో వుండేమాట యిప్పుడు బయటి కొచ్చేసింది" అంటూ ముఖం ముడుచుకున్నాడు ఆమె భర్త

ఖాళీ టీ గ్లాసును టేబులుపైన వుంచుతూ "యిష్టంలేకపోతే తలాక్ జెప్పెయ్యి. మీ అమ్మానాయినా సంతోషపడ్తారు. కావాలంటే యింకోనిఖా గూడా చేస్తారు..." అని మరో ప్రతిపాదనను లేవనెత్తాడు రహంతుల్లా.

"యిష్టంలేదని యెవురు చెప్పినారు? అయితే మారేజీ అయిపోయింది గదా అని ఆయన చెప్పినట్లంతా తలాడించే దానికి నా వల్లగాదు. మొన్నొక నాడు, కాలేజీలో యేదో ఫంక్షను జరిగింది. ఆ పొద్దు బొట్టుపెట్టుకోకుండా కాలేజీ కొచ్చినానని మా ఫ్రెండ్సు ముందర్నే కొట్టినాడు. అట్లంతా జేస్తే నేను పడుండను" తలవంచుకునే స్పష్టంగా చెప్పింది గుల్నార్ బేగం.

"కోపమొచ్చి నేను రెండేసినానే అనుకో! దానికి నువ్వేం చేసినావో అది గూడా చెప్పు! అంతమందిలోనూ నా చెంప చెళ్ళుమనిపించలేదా?" అతనీసారి కోపగించుకో డానికి బదులుగా మెల్లగా నవ్వుతున్నాడు.

"నా వొళ్ళు చురీమంటే గొమ్మునుండలేను. ఆ సంగతి తెలిసిగూడా నన్ను రెచ్చగొట్టేదెందుకు?" గుల్నార్‌బేగం మాత్రం దెబ్బ యిప్పుడే తగిలినట్టుగా విలవిలలాడిపోతోంది.

బెంచీపైన కూర్చున్న మౌలాల్లో వొకతను గొంతు సవరించుకున్నాక "మీదంతా లాయకీ లేని మాటలు. నేను చెప్పేది జతన్‌గా వినండి" అంటూ చెప్పుకుపోసాగాడు. "అప్పుడెప్పుడో మనోన్ని నిఖా చేసుకోని బూబయిపోయిన ఆడబిడ్డ సంగతి చెప్పినాడు.గదా యీయన! అప్పుడైనా యిప్పుడైనా జరిగేది అదే! కావాలంటే సున్నీజెయ్యించి యీయన్ను గూడా మనం కలుపు కోవచ్చు.

యెంత బొట్టుపెట్టుకోని, మంగళసూత్రం గట్టుకున్నా, మన బిడ్డను వాళ్ళు వాళ్ళ యిండ్లల్లోకి చేరదియ్యరు. మీ సంగతి సరే బిడ్డలు పుడితే వాళ్లకేం పేరు పెడతారు? మీ బిడ్డలను యెవురు పెండ్లాడతారు? అన్నిటికీ అల్లా బరాకత్ కావాల! అల్లాను తప్ప యింకే దేవుడ్ని నమ్మినా పాపం. నమ్మని కాపిర్లకు అల్లాదువా దొరకదు. మీరంతా పాపం చేసుకుంటా వుండారు. స్వర్గం తలుపుల్ని మీకు మీరే మూసేసుకుంటావుండారు..."

"అన్నా! యింటికాడ సామి యెదురు చూస్తావుండాడు. అమ్మ నిన్ను పిలుచుకోని రమ్మనింది" అన్న అమ్మాయి గొంతొకటి వినిపించగానే రాంబాబు వులిక్కిపడి వీధి తలుపులకేసి తిరిగి చూశాడు. కంగారు పడుతూ పైకి లేచి, యింటి బయటికొచ్చి, తమ యింటికేసి పరుగుతీశాడు. రాంబాబు చెల్లెలు మాత్రం పెద్ద అంగలు వేస్తూ వెనకే రాసాగింది.

"అయివోరు అరగంటనించీ నీకోసరం కాపెట్టుకోనుండాడు. కాళ్లు గడుక్కోని రాముందు!" అంటూ కస్సుమంది మాణిక్యమ్మ.

పెరట్లో కాళ్లు కడుక్కుంటూ "నేను రాకపోతే యేమయ్యింది? ఆపనేదో నువ్వే చేసెయ్యగూడదా?" అన్నాడు రాంబాబు.

"ఆడోళ్లుకాదు తర్పణమొదిలేది. అదినువ్వేచెయ్యాల. మనింట్లో పనిముగించినాక చల్లూరు రామనాథంశెట్టి యింట్లో యింకోదో కార్యానికి పోవాలని అయివోరు అరస్తావుండాడు..." అందామె.

అప్పటికే పూజకోసం సామాగ్రి సమర్చుకుని కూర్చున్న కిష్టసామి "ముహూర్తాలూ, లగ్నాలూ కలిసికట్టుగానే ముంచుకొస్తాయి. యీ వూళ్లోవుండే యింతమంది కోమిటోళ్ళకూ, రెడ్లకూ, మిగిలిన శూద్రులందరికీ యేం జరిగినా నేనే చూసుకోవాల. దేవళం అయివోరు దీనికంతా పనికిరాడు. తిరగలేక నా కాళ్ళు గుంజుతున్నాయి" అన్నాడు.

"నిజమే సామీ! మీరే వూళ్లో లేకుండా వుంటే యింక మా పనులయినట్లే!" అతడి కష్టాన్ని గుర్తించినట్టుగా మాణిక్యమ్మ వాపోయింది.

"మాకు మంగళంపేటలో పెద్దపూరిల్లుండాది. అయినా వాటంబాకం లోకనాథం శెట్టి బలవంత పెడితే యిక్కడి కొచ్చాము. వాళ్ల గోడౌను ముందుండే గదిని మాకు బాడుగలేకుండా యిచ్చినాడే అనుకో! అదెక్కడ చాలుతుంది? యింటికెదురుగా రహీంసాబు యిల్లు. వాళ్లు చింతపండు యాపారం చేస్తే చింతగింజలన్నీ మా యింటి ముందు దిగ్గొలకాలా చెప్పు? అదేంపాడో,

ప్రతిరోజూ వాళ్లింటిలోంచీ మసాలా వాసనలే వస్తాయి. చాలనిదానికి సాయిబులపిల్లోళ్లు గొంతులు గోసేసిన కోడిపిల్లల్ని మా యింటి ముందునుంచే యెత్తుకు పోతూంటారు. మళ్లీ మావూరి కెళ్లిపోదామని మా ఆడోళ్లు సతాయిస్తున్నారు." రాంబాబు దగ్గరకు రాగానే అతను మాట్లాడడం కాస్సేపాపి, "అలాకూచో! పద్మాసనమేసుకోవాలి. ముందు తీర్థం తీసుకోరా! చెయ్యిదూరంగా పెట్టుకో! స్పూనుకు తగిలించద్దురా. యేదీ యీ మంత్రం చెప్తాను. తిరిగీ అదేలా చెప్పు!" అంటూ శ్లోకం చదివాడు. సంస్కృతం మాటల్ని వల్లించటానికి ప్రయత్నించి విఫలుడైపోయిన తర్వాత, రాంబాబు కేవలం చిత్రమైన శబ్దాన్ని మాత్రమే ప్రసారం చేశాడు. రహీం సాహేబు యింట్లో గడప దగ్గర కూర్చుని, జమాత్‌తో మంతనాలు జరుపుతున్న గుల్నార్‌బేగమే మళ్లీ మళ్లీ జ్ఞాపకం రావడంతో, రాంబాబు అన్యమనస్కంగా కిష్టసామి సూచనలు పాటించసాగాడు.

"నీ కొడుక్కు వాళ్ళ తాతపేరు గూడా తెలియదు. గోత్రమడిగితే నోరుదెరి చేస్తున్నాడు. యిట్లయితే దేనికీ పనికిరాకుండా పోతాడు. కొంచెం పూజా పునస్కారం నేర్పించు. మంచి మార్కులు తెచ్చుకుని వాడు పైకి రావాలని వుందాలేదా నీకు? ఆ సాయిబుల పిల్లలతో తిరగడం మాన్పించి, నలభైదినాలు నవగ్రహాలు చుట్టమను." అంటూ హుంకరించాడు కిష్టస్వామి.

అరగంటలో తతంగాన్ని ముగించేశాక, బియ్యమూ, గుమ్మడికాయా తన సంచిలో వేయించుకున్నాడతను. దక్షిణతో బాటూ కొత్త సవకాన్ని గూడా కిష్టసామి ముందుంచాక, అతడి కాళ్లకు నమస్కారం చేసుకున్నాడు రాంబాబు.

ఆశీర్వాదమో, మందలింపో, అర్థంగాని మాటల్ని బడబడ మంటూ గొణిగాక, కిష్టస్వామి గబగబా బజారువీధికేసి వెళ్లిపోయాడు.

"తెల్లారి నించీ పచ్చి మంచినీళ్లయినా తాగలేదు. అన్నం తిన్నాకగానీ బయటికి పోవద్దు" అంటూ విసుక్కొంది మాణిక్యమ్మ. ఆదరాబాదరా రెండు ముద్దలు మింగేశాక రాంబాబు మళ్లీ అక్బర్ వాళ్ల యింటికేసి పరిగెత్తాడు.

అప్పుడు గూడా హాల్లో మంతనాలు సాగుతూనే వున్నాయి. బెంచీలపైన జమాత్‌పెద్దలూ, కుర్చీల్లో ఆరై రహంతుల్లా, అక్బర్ పెద్దన్న, గుల్నార్ బేగం భర్త, ద్వారాని కవతల వంటగదిలో గుల్నార్‌బేగం, బెంచీపైన అక్బర్ తమ తమ స్థానాలకు అతుక్కుపోయి నట్టుగా కనిపిస్తున్నారు. గోడవారగా పరిచిన చాపపైన మాత్రం యిద్దరు కొత్త వ్యక్తులు కూర్చునివున్నారు. నలిగిన పైజమా జుబ్బాలు తొడుక్కున్న అతనూ, నల్ల బురకాను పక్కన పెట్టుకుని కూర్చున్న ఆవిడా

మట్టిగొట్టుకుపోయి, చాలా దూరం ప్రయాణం చేసి వచ్చిన వాళ్లలా కనబడుతున్నారు. "గుల్నారక్క వాళ్ల అమ్మా నాయినా!" అంటూ అక్బర్ రాంబాబు చెవుల్లోకి వూదాడు.

"గల్ఫ్‌లో నా ఫ్రెండొకడుండాడు. యింగ్లీషు లెక్చరర్లకు అక్కడ డిమాండుండాదని చెప్పినాడు. యీ సమత్సరమట్ల పరీక్షలయి పోతానే పెండ్లిజేసి గల్ఫ్‌కు పంపిద్దామని అనుకున్నాము..." ముఖంలో చిడుముడిపాటు తారట్లాడుతుండగా గుల్నార్‌బేగం తండ్రి కొనసాగించాడు.

"యిప్పుడు మాత్రం మించిపొయ్యిందేముంది? యిద్దర్నీ గల్ఫ్‌కు పంపించండి" అంది గుల్నార్ బేగం.

"నలుగుర్లో తలెత్తుకోని తిరగలేకుండా జేసినావు. యీ పెండ్లికి తలాక్‌జెప్పి యింటికొస్తేనే, గల్ఫ్ గురించి ఆలోచన చేసేది!" అంది గుల్నార్‌బేగం తల్లి కోపంగా.

"యింకోసారి ఆమాటెత్తితే యిప్పుడే యెళ్లిపోతాను" గుల్నార్ బేగం విదిలించి కొట్టింది.

"మీ అమ్మా నాయినా మాటా వినవు. ఆ అబ్బాయి మాటప్రకారం బొట్టూ పెట్టుకోవు. నీదంతా వితండంగా వుంది" అంటూ రహంతుల్లా విసుక్కున్నాడు.

"యెప్పుడో యెవురో యేమో చేసినందుకు నన్ను బలవంతం చేసేదేం న్యాయం? యే పనయినా అడగే రకంగా అడిగినప్పుడే చెయ్యాలనిపిస్తుంది. బలవంతం చేస్తే యిష్టమొచ్చిన పనయినా చెయ్యాలని పించదు." అంది గుల్నార్ బేగం.

"మీ కిష్టం వచ్చినట్టంతా ఆడేందుకు జమాత్‌వొప్పుకోదు." అంతసేపూ మౌనంగా వుండిపోయిన తెల్లగడ్డపు ముసలాయన నెమ్మదిగా తన ఫర్మానా జారీ చేశాడు. "రెండేండ్లకు ముందు చచ్చిపోయినాడే దూదేకుల కబీరుసాబు, ఆయినకు కొల్ల బోయినంత ఆస్థి. షేకు మోదీన్ సాబు ఆయన కొడుక్కు తన కూతుర్నియ్యాలని ప్రయత్నం చేసినాడు. దూదేకులోళ్లకంటే షేకులు గొప్పగదా! అయినా జమాత్ వొప్పుకోలేదు. ఆ కడప పక్క సయ్యద్‌లు జాస్తి. వాళ్లతో గూడా మనూరికి సంబంధాలు లేవు. అట్లాంటి దానికి శాస్త్రాలూ, జమాత్‌లూ వొప్పుకోవు. అల్లాను యెదిరిస్తే నాశనమైపోతారు. అల్లా అంటే భయంలేకుంటే నరకానికి పోతారు."

"వయసులోవున్నప్పుడు మంచి మాటలు చెవికెక్కవులే చిచ్చా!" గుల్నార్

బేగం తండ్రి జీరబోయిన కంఠంతో చెప్పసాగాడు. "యిప్పుడంతా పచ్చ పచ్చంగానే వుంటింది. యీ మోజు తీరిపోయినాంక వాడు రెండు తన్నేసి యెనక్కి తిరిగి జూడకుండా చక్కాయెలబారిపోతాడు. అప్పుడు తెలిస్తింది మంచేందో, చెడ్డేందో!"

యెవరో యీడ్చి కొట్టినట్టుగా గుల్నార్ భర్త దిగ్గున లేచి నిల్చున్నాడు. రహంతుల్లా కేసి తిరిగి "సార్! మీకో నమస్కారం!" అంటూ చేతులు జోడించాడు. "మీరేదో సహాయం చేస్తారని నమ్మి, మీరు రమ్మంటే యిక్కడికొచ్చినాను. మా యిద్దరిమధ్యా మాటపట్టింపొచ్చిందని మూడోమనిషి మధ్యిస్తానికి వొప్పుకునిందే తప్పు. నా మీద నమ్మకముంటే నా పెళ్లాం నాతో వస్తాది. లేకుంటే లేదు." చెబుతూ చెబుతూనే అతను గడపదాటేశాడు. మరో రెండునిముషాల తర్వాత గుల్నార్ బేగం గూడా వీధిలోకెళ్లిపోయింది. వీధిమలుపు దగ్గర వాళ్లిద్దరూ కలుసుకోవడం గూడా హాల్లో కూర్చున్నవాళ్లకు స్పష్టంగా కనబడుతోంది.

జమాత్ పెద్దలందరూ పైకి లేచేశారు. వాళ్లందరిలోకీ పెద్దవాడుగా కనిపిస్తున్న వ్యక్తి "అల్లాకు మనపైన దయలేదు. వూర్లో మనోళ్లు జాస్తిగానే వుండారు గానీ, చుట్టు పక్కల పల్లెలంతా హిందువులే! అందురూ యీమాదిరి తయారైతే నగుబాట్లయి పోతింది. తిరిగిన చోట తిరగకుండా, యెక్కిన గడప యెక్కకుండా, అందురి చెవుల్లో జోరీగల మాదిరిగా, నమాజుకు రమ్మనీ, పాకీగా వుండమనీ చెప్పతానే వుండాము. కానీ అల్లాదయ తప్పతానే వుండాది" అని గొణుక్కుంటూ గడపదాటి వెళ్లిపోయాడు. మిగిలిన వాళ్లు గూడా నిట్టూరుస్తూ అతడి వెనకే సాగిపోయారు.

చెమటతో తడిసిన బారీ శరీరాన్ని మరోవైపుకు వొత్తిగిలజేస్తూ "మన బిడ్డ వానెనకాలబడిపోతావుంటే గొమ్మునా గుర్చుంటే యెట్ల? రెండు వాయించి యింట్లో కుదేయచ్చుగదా!" అంటూ వాపోయింది గుల్నార్ తల్లి.

కళ్లు పెద్దవి చేసుకుని ముందుకు వంగుతూ "అట్లాంటి పనేదైనా చేసేరు జాగ్రత్త! అదిమేజరు. కంప్లయింటిచ్చిందంటే పోలీసుస్టేషన్ల చుట్టూ తిరగాల్సిందే మనం!" అన్నాడు రహంతుల్లా.

"ఆడబిడ్డకు ఖురాన్ చదివేదొస్తే చాలంటే వినకుండా కాలేజీ కంపిస్తివి. అదిప్పుడు లా పాయింట్లు మాత్రం బాగనే చదివింది. కంటికి నదురుగా ఆడబిడ్డ కనబడితే యెగరేసుకోని పోదామని అందరూ యెగజూసుకోనే వుంటారు.

యెవుర్నిబడితే వాణ్ణి యింట్లోకి రానియ్యకుండా కాపలాగాయచ్చు. కాలేజీల్లో కుదిరితిందా?" గుల్నార్ బేగం తండ్రి కోపంతో రొప్పసాగాడు.

"మనుషులందరూ వొకేరకంగా వుండర్రా!" రహంతుల్లా తమ్ముణ్ణి మందలించడం మొదలుపెట్టాడు. "యింట్లో ఆడబిడ్డలుండారని అందర్నీ రానియ్యకుండా అడ్డంపడితే మనకే నష్టం. యిప్పుడీ పిల్లోణ్ణి చూడు. వీడు మన మొగరాల విజయరంగమయివోరి కొడుకు. వీళ్ళ నాయినే లేకుంటే నీకు గుణింతాలైనా వచ్చుండునా?"

రాంబాబు వులిక్కిపడి, హాల్లో మిగిలిన వ్యక్తులందరి ముఖాలూ పరీక్షించి చూడసాగాడు. ఆ తరువాత కంగారుపడుతూ పైకి లేచి, పిల్లిలా మెత్తటి అడుగులు సారిస్తూ, యింటి బయటి కొచ్చేశాడు.

వీధిలోకొచ్చి నిల్చుని, బండ్ల వీధికేసి పరకాయించి చూశాడు.

గోతాల పరదావేలాడుతున్న వసారాకెదురుగా, వీధిలో ఆరిపోయిన కుంపటియింకా కొలువుతీరివుంది. వొరగిలిన పరదాకింద వరండాలో పడుకున్న వ్యక్తి తాలూకూ పాదాలూ మాత్రం కనిపిస్తున్నాయి. పాదాల కవతల, గోడ పక్కన, గుమ్మడి కాయ ముక్కలూ, దర్భపుల్లలకట్టలూ కనబడుతున్నాయి.

భుజం పైన చేయిపడగానే రాంబాబు వులిక్కిపడి వెనుదిరిగాడు. "యీ పొద్దు శుక్రారం గదా! గోరీల కాడికి పోయొద్దామా?" అని అడుగుతున్నాడు అక్బర్.

రాముడిగుడి ముందుగా తిరిగి, బజారు వీధిగుండా సాగబారి, వూరిచివర్లోని యేరుదాటి, యేటి పక్కన వున్న పిల్ల కాలవ గట్టు పై కొచ్చారు యిద్దరూ. ముళ్లపొదల మధ్య, బిక్కుబిక్కుమంటూ వొంటరిగా సాగుతున్న కాలిబాటపైన, అయిదునిముషాలు మౌనంగా నడచారు. పాత చెక్‌డ్యాం దగ్గరి కొచ్చాక ఆగిపోయి, అవతలి గట్టుకేసి చూడసాగాడు రాంబాబు. అక్బర్‌గూడా అటువైపుకు తిరిగాడు. యేటికవతలి గట్టుపైన సిమెంటుతో కట్టిన సమాధులు కొన్ని కనిపిస్తున్నాయి. వాటి మధ్యలోనే మట్టి సమాధులూ, అక్కడక్కడా తులసి కోటలూ, దీపపు దీగుళ్లూ కనిపిస్తున్నాయి. దూరంగా వొకటిరెండు బూడిద కుప్పలు గూడా వున్నాయి.

"నువ్వీ గోరీల దగ్గిరికి వచ్చినప్పుడంతా నేనూ నీతో వస్తా వుండాను. యేటికాపక్కుండే శ్మశానానికి పోవాలంటే మాత్రం భయమేస్తాది. మీగోరీలకాడికి మాత్రం భయంలేకుండా వచ్చేస్తాను. యెందుకు?" అని ప్రశ్నించాడు

రాంబాబు.

సమాధానానికి బదులుగా "చచ్చిపోయిన తర్వాత కాల్చేది మంచిదా, పూడ్చేది మంచిదా?" అంటూ సందేహాన్ని సరఫరా జేశాడు అక్బర్.

"రెండూగాదు, యీడ్చేసేది మంచిదని మా నాయనమ్మ చెప్పింది!" అన్నాడు రాంబాబు ముందుకు కదులుతూ.

యేటికవతలి గట్టుపైన పెద్ద ప్రహరీ గోడ కనబడుతోంది. దాని యినప తలుపుల గేటును దాటగానే, బావీ, దానికి కాస్త దూరంలో యీద్గా గోడా కనబడుతున్నాయి. బావిలోంచీ బక్కెట్టుతో నీళ్లు తోడుకుని కాళ్లు కడుక్కున్నాడు అక్బర్. బకెట్టులో మిగిలిన నీళ్లతో రాంబాబు గూడా కాళ్లు కడుక్కున్నాడు.

బావిదగ్గరి నుంచీ ఆరేడు యెకరాల కవతల కనబడుతున్న గుట్టవరకూ, రకరకాల గోరీలు కనబడుతున్నాయి. యెటు వీలయితే అటు శవాల్ని ఖననం చేయడంవల్ల, గోరీల మధ్య కాలిబాటలు రకరకాలుగా వ్యాపించివున్నాయి. కొన్నిపాత సమాధులు నేలమట్టమైపోయినా, వాటి పక్కన నాటిన రాతి పలకలపైన అక్షరాలు మాత్రం స్పష్టంగా కనబడుతున్నాయి. గోరీలమధ్య మొలిచిన పిచ్చిమొక్కల్లో గోరీలపైన వేసిన పూలసేరాలు సర్దుకుపోయి వున్నాయి. పొడుగ్గాపెరిగిన గుల్మొహర్ చెట్టుకింద సిమెంటు సమాధి ముందు ఆగాడు అక్బర్. ఆ సమాధి తల దగ్గరి పాలరాతి పైన "షేక్ రహీంసాహేబు, జననం: 23 మార్చి, 1941: మరణం: 11 జూలై 1993' అన్న తెలుగు అక్షరాలు కనిపిస్తున్నాయి. సమాధి చుట్టూ పడివున్న చెత్తనంతా శ్రద్ధగా తీసిదూరంగా పారేసిన తర్వాత, దాని పాదాల దగ్గర నిలబడి, తలకు రుమాలు చుట్టుకుని, చేతులు దోనెలా పట్టుకుని, కళ్లు మూసుకుని, నాలుగైదు నిముషాలసేపు యేదో గొణిగాడు అక్బర్.

దూరంగా ప్రహరీగోడ దగ్గర, ధీమాగా నిల్చున్న రావిచెట్టు కొమ్మల్లోంచీ సూర్యకిరణాలు సమాధులపైకి యెండల తెరల్ని జాలువారుస్తున్నాయి. అక్బర్ పక్కనే నిలబడి చుట్టూ కలయజూడ సాగాడు రాంబాబు. అక్కడున్న సమాధులన్నింటిలోనూ మానవ శరీరాలుండేవన్న సంగతి స్ఫురించగానే వాడి శరీరంపైన వెంట్రుకలు నిక్కబొడుచుకున్నాయి.

కాస్సేపటి తర్వాత కళ్లు తెరుచుకుని, చేతులను పెదవులపైకి చేర్చి శబ్దం వచ్చేలా చుంబించాక "పోదాంపద!" అన్నాడు అక్బర్. సమాధుల మధ్య దారి చేసుకుంటూ యిద్దరూ నడవ సాగారు.

ప్రహరీ గోడ దాటిన తర్వాత "చచ్చిపోయిన తర్వాత మనిషే మవతాడు?" అని అడిగాడు రాంబాబు.

"స్వర్గానికి పోతాడంట! మా అమ్మచెప్పింది" అన్నాడు అక్బర్. "స్వర్గంలో నదులనిండా సారాయే వుంటాదంట! యెవురికేం కావాలంటే అది తినచ్చునంట!"

చెక్‌డ్యాం దగ్గరి కొచ్చాక "అదేం కాదు. స్వర్గంలో దేవేంద్రుడుంటాడు. రంభవూర్వశి మేనకలు వుంటారు. అమృతముంటాది. దేవతలకు చావేలేదు" అన్నాడు రాంబాబు.

తల అడ్డంగా తిప్పుతూ "అదేమో తెలియదు. మా ఖురాన్‌లో మాత్రం ఆ మాదిరే రాసినారంట!" అన్నాడు అక్బర్.

అక్బర్ భుజంపైన చేయివేసి ఆపుతూ, "మానాయినకు నోట్లో నాలిక లేదని అందురూ అంటారు. మా నాయినమ్మ చెప్పే ఆ స్వర్గంలో గూడా కిష్టసామయివోరు, హరప్పశెట్టి లాంటోళ్ళుంటే, అక్కడగూడా ఆయన్ను సుఖంగా వున్నీయరు. ఆయిన అందుకే మా స్వర్గానికి పొయ్యేదానికంటే మీ స్వర్గానికి పోతేనేమేలు. వొకసారి ఆ పక్కుండే శ్మశానానికి గూడా పోయొద్దామా? నువ్వు చదివే ఆ సూరాలేవో నాకూ జెప్పు. యీ పొద్దు ఆయన దివసం గూడా!" అన్నాడు రాంబాబు.

కళ్లార్పడం సైతం మరచిపోయి వాడికేసి కాస్సేపు మిర్రిమిర్రీ చూసిన తర్వాత, అలాగే నన్నట్టుగా తలవూపుతూ ముందుకు కదిలాడు అక్బర్.

*(24 జూన్, 2003 యిండియాటుడే)*

❖ ❖ ❖